
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శనివారం 3 ఫిబ్రవరి 2024

కొత్త రాగి వంగడం ఇంద్రావతి

- అధిక దిగుబడి, మెండైన పోషక విలువలు
- ఖరీఫ్‌లో గిరిజన రైతులతో సాగుకు ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల ప్రణాళిక
- విత్తనాలు పంపిణీ చేస్తామని ఏడీఆర్ వెల్లడి

ఏజెన్సీలో సాగుకు అత్యంత అనుకూలం

చింతపల్లి, ఫిబ్రవరి 2:

గిరిజన రైతులు సంప్రదాయ పంటగా సాగుచేసే రాగి (చోడి)లో అత్యధిక దిగుబడి, మెండైన పోషక విలువలు కలిగిన 'ఇంద్రావతి' నూతన వంగడాలను చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో గత నెల ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో మేలి రకం రాగి విత్తనాలను రైతులకు అందజేయాల్సిన అవసరం ఉన్నదని శాస్త్రవేత్తలు సూచించారు. దీంతో నూతన వంగడం అభివృద్ధి కోసం గిరిజన రైతులు ఖరీఫ్‌లో విత్తే సమయానికి చిరు సంచుల్లో విత్తనాలు అందజేసేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఇంద్రావతి రకం రాగి కంకులు (ఫైల్ ఫొటో) (ఇన్‌సెట్‌లో) ఇంద్రావతి రకం రాగి విత్తనం



ఆర్‌ఏఆర్‌ఎస్‌లో సాగు చేసిన ఇంద్రావతి రాగి పంట (ఫైల్ ఫొటో)

జిల్లాలోని పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో రాగి పంటను గత ఏడాది 18,176 హెక్టారుల్లో రైతులు చేశారు. పదేళ్ల కిందట సుమారు 25 వేల హెక్టారుల్లో రాగి పంటను సాగుచేసేవారు. నాణ్యమైన విత్తనం అందుబాటులోలేకపోవడం, దేశవాళీ రకాలతో అధిక దిగుబడులు రాకపోవడం వల్ల కాలక్రమంగా రాగి పంట సాగు విస్తీర్ణం పడిపోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని ఆదేశించడంతో గిరిజన ప్రాంతంలో రాగి సాగుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు 'ఇంద్రావతి' అనే వంగడాన్ని రైతులతో సాగు చేయించాలని నిర్ణయించారు. ఈ విత్తనాన్ని గత ఏడాది పది మంది రైతులకు అందజేశారు. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. రానున్న రోజుల్లో ఎక్కువ మంది రైతులు ఇంద్రావతి రకాన్ని సాగు చేయడానికి విత్తనాభివృద్ధి కోసం ఎంపిక చేసిన రైతులకు ఈ ఏడాది వంగడాలను అందజేయనున్నారు.

ఖరీఫ్‌లో సాగుకు మినీ కిట్లు పంపిణీ



ఇంద్రావతి వంగడాన్ని విజయనగరం ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ వంగడాలపై వివిధ పరీక్షలు నిర్వహించి మన్యంలో సాగుకు అత్యంత అనుకూలమని గుర్తించారు. దీనిని చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రయోగాత్మక సాగు చేపట్టి ఉత్తమ ఫలితాలు సాధించాము. విత్తిన 115-120 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరాకు 14-15 క్వింటాళ్ల దిగుబడి వుంటుంది. ప్రధానంగా రాగి పంటకు బెడదగా మారిన అగ్గితెగులును ఈ రకం తట్టుకుంటుంది. రానున్న ఖరీఫ్‌లో ఎంపిక చేసిన రైతులకు ఇంద్రావతి రకం రాగి విత్తనాలను చిరు సంచుల (మినీకిట్లు) ద్వారా అంజేస్తాం.

డాక్టర్ ఎం.సురేశ్ కుమార్ ఏడీఆర్, ఆర్‌ఏఆర్‌ఎస్, చింతపల్లి

చిరుధాన్యాల్లో రారాజు రాగి



చిరుధాన్యాల్లో రాగికి ప్రత్యేక స్థానం ఉంది. కొంతకాలం నుంచి ప్రజల ఆహార అలవాట్లు మారాయి. బియ్యం స్థానంలో చిరుధాన్యాల వాడకం పెరిగింది. రక్తహీనతతో బాధపడుతున్న వారితోపాటు గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో వున్న బాలికలు బాలికలు రాగితో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. రాగి పిండితో ఇడ్లీ, దోశలు, బిస్కెట్లు, జావ, సంగటి, చపాతీలు.. ఇలా పలు రకాల ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చు. ఇంద్రావతి రకం రాగుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. 100 గ్రాములకు క్యాలిషియం 428 ఎంజీ, ఐరన్ 58 పీపీఎం, జింక్ 44 పీపీఎం వుంటాయి.

- బి.దివ్యసుధ, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, బీసీటీ-కేవీకే హరిపురం

జైస్వాల్ వీరవిహారం



సెంచరీ అనంతరం అభివాదం చేస్తున్న జైస్వాల్

ఫోర్లు, సిక్సర్లతో మెరుపు శతకం

- ఇంగ్లండ్ బౌలర్లను బెంబేలెత్తించిన యువ క్రికెటర్
- నిరాశపరిచిన కెప్టెన్ రోహిత్ శర్మ, లోకల్ బాయ్ శ్రీకర్ భరత్
- క్రీడాభిమానులను అలరించిన టెస్ట్ తొలిరోజు ఆట
- ఊహించిన దానికంటే ఎక్కువగానే హాజరైన ప్రేక్షకులు



జైస్వాల్‌ను అభినందిస్తున్న ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 2:

భారత్, ఇంగ్లండ్ మధ్య శుక్రవారం నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ప్రారంభమైన రెండో టెస్ట్ తొలిరోజు ఆటను ప్రేక్షకులు బాగానే ఎంజాయ్ చేశారు. కెప్టెన్ రోహిత్‌శర్మ, లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ నిరాశపరిచినా యశస్వి జైస్వాల్ ఫోర్లు, సిక్సర్లతో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడి భారీ సెంచరీ (175) చేశాడు.

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే సారథి రోహిత్‌శర్మ (14) తొలి బంతి నుంచి అతి జాగ్రత్తగా ఆడుతూ కేవలం సింగిల్స్‌కే పరిమితం అయ్యాడు. సుమారు 70 నిమిషాలపాటు క్రీజులో ఉన్న రోహిత్ శర్మ..41 బంతులను ఎదుర్కొని కేవలం 14 పరుగులు చేసి స్పిన్నర్ షోయిబ్ బషీర్ బౌలింగ్‌లో పోప్ క్యాచ్ పట్టడంతో తొలి వికెట్‌గా అవుటయ్యాడు. రోహిత్ శర్మ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శుభమన్ గిల్ (34) ధాటిగా ఆడి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. లూజు బాల్స్‌ను బౌండరీలకు తరలించి క్రీడాభిమానులను హుషారెత్తించాడు. వికెట్ల ముందు నిలదొక్కుకుంటున్న సమయంలో అండర్సన్ వేసిన షార్ట్ బాల్ బ్యాట్‌ను తాకి కీపర్ చేతులోకి వెళ్లడంతో రెండో వికెట్‌గా పెవెలియన్‌కు చేరాడు.

బెంబేలెత్తించిన జైస్వాల్

మందకొడిగా సాగుతున్న భారత్ బ్యాటింగ్ స్వరూపాన్ని యశస్వి జైస్వాల్ మార్చేశాడు. బౌండరీలు, సిక్సర్లతో క్రీడాభిమానులను ఉర్రూతలూగించాడు. 89 బంతుల్లో ఆరు బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీ చేసిన జైస్వాల్..రెండో అర్ధసెంచరీని కేవలం 17 బంతుల్లో పూర్తిచేశాడు. జైస్వాల్..101 బంతుల్లో 11 బౌండరీలు, మూడు సిక్సర్లతో తన కెరీర్‌లో రెండో టెస్ట్ సెంచరీ సాధించాడు. తొలిరోజు 93 ఓవర్లలో ఆరు వికెట్లకు 333 పరుగులు చేయగా, అందులో 179 పరుగులు జైస్వాల్ చేసినవే కావడం విశేషం. ఇంకా మిగిలిన వారిలో శ్రేయాస్ అయ్యర్ (27), పటీదర్ (32), అక్షరపటేల్ (27), కేఎస్ భరత్ (17) చేశారు. ఆట ముగిసే సమయానికి జైస్వాల్ భారీ అజేయ భారీ సెంచరీతో (179 నాటౌట్) నాటౌట్‌గా ఉన్నాడు.

నిరాశపరిచిన లోకల్ బాయ్ భరత్

సొంత గడ్డపై టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ స్థానిక క్రీడాభిమానులను నిరుత్సాహపరిచాడు. అక్షర పటేల్ అవుటైన అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భరత్‌కు ప్రేక్షకులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. బషీర్ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ మీదుగా పవర్‌ఫుల్ షాట్‌తో బౌండరీ కొట్టి ఖాతా తెరిచిన భరత్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ప్రోత్సాహం అందింది. తర్వాత ఓవర్‌లో ... మిగతా 7వ పేజీలో

స్పందన అర్జీలకు జవాబుదారీగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

- స్పందనలో 105 వినతులు స్వీకరణ



స్పందనలో అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్క శాఖ నుంచి అధికారులు తప్పకుండా స్పందనకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

స్పందనలో 105 వినతులు స్వీకరణ

స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు 105 వినతులను అధికారులకు అందించారు. పాడేరు మండలం దేవాపురం పంచాయతీ పరిధిలో గదబూరు నుంచి కుమ్మరిపాలెం వరకు, డప్పాడ గ్రామం నుంచి జర్రిగరువు వరకు మిషన్ కనెక్ట్ పాడేరులో మంజూరు చేసిన రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ కిల్లు పరమేశ్వరి వినతిపత్రం సమర్పించారు. హుకుంపేట మండలం జర్రకొండ పంచాయతీ సరియా గ్రామం నుంచి గనిక గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని సర్పంచ్ కొర్రా చిట్టిబాబు కోరారు. అరకులోయ మండలం బొండాం పంచాయతీ జయంతివలస గ్రామానికి చెందిన కిల్లో బుజ్జిబాబు.. వ్యవసాయ పనులు చేసుకోవడానికి పవర్ వీడర్ మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. పాడేరు మండలం సలుగు సచివాలయ భవనానికి విద్యుత్ సదుపాయం కల్పించాలని ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్.మీనా కోరారు. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ పరిధిలోని మాలగుమ్మి, శరభపుట్టు, కుజభంగి, సరియాపల్లి గ్రామాలకు తాగునీటి సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ వి.రత్న వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం.రాజు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ వి.మురళి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మన్యం గజగజ

పెరుగుతున్న చలి తీవ్రత, దట్టంగా పొగమంచు

- కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- జీకేవీధి, అరకులోయలో 9.7 డిగ్రీలు



చింతపల్లిలో ఉదయం తొమ్మిది గంటలకు దట్టంగా కురుస్తున్న మంచు

పాడేరు (ఆంధ్రజ్యోతి)/ చింతపల్లి, ఫిబ్రవరి 2: ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది. శుక్రవారం జీకేవీధి, అరకులోయలో 9.7, జి.మాడుగులలో 9.8, చింతపల్లిలో 10.8, పాడేరులో 11.7, పెదబయలులో 11.8, హుకుంపేటలో 11.9, ముంచంగిపుట్టులో 12, డుంబ్రిగుడలో 12.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు వారం రోజుల నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొంచెం అటుఇటుగా ఇదే విధంగా నమోదు అవుతుండడం, ఉత్తరాది నుంచి వస్తున్న శీతల గాలులతో చలి తీవ్ర అధికంగా వుంటున్నది. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు పొగ మంచు దట్టంగా కమ్ముకుంటున్నది. వాహనాలకు హెడ్ లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తున్నది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు వాతావరణం కొద్దిపాటి వేడిగా వుంటున్నది. ఆ తరువాత శీతల గాలులు మొదలవుతున్నాయి. చింతపల్లి, లంబసింగి, తాజంగి, ఆర్వీనగర్, జీకేవీధి ప్రాంతాల్లో సాయంత్రం ఐదు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 11 గంటల వరకు చలి గజగజ వణికిస్తున్నది. ఏజెన్సీ వాసులు చలి మంటలు, ఉన్ని దుస్తులతో చలిబారి నుంచి శరీరాన్ని కాపాడుకుంటున్నారు.



పాడేరులో శుక్రవారం ఉదయం పొగమంచు ముసుగు

ప్రభుత్వ విప్‌కు చేదు అనుభవం

ధర్మశ్రీని నిలదీసిన కొమిర రైతులు, యువకులు

- గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ధ్వజం
- వైసీపీ నేతలు ఎదురుదాడి
- ఇరువర్గాల మాధ్య మాటల యుద్ధం



ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని నిలదీస్తున్న యువకులు, రైతులు

రావికమతం, ఫిబ్రవరి 2: ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి మండలంలోని కొమిర గ్రామంలో చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నెల రోజుల్లోనే పెద్దేరు కాలువ నుంచి తూము ఏర్పాటు చేసి కేఎం ఛానెల్ ఆయకట్టుకు సాగు నీరు అందిస్తానన్న హామీని నాలుగురేళ్లయినా ఎందుకు అమలు చేయలేదని పలువురు రైతులు, యువకులు నిలదీశారు. మరి కొద్ది వారాల్లో ఎన్నికలు జరగనున్నాయి, కేఎం ఛానెల్ ఆయకట్టుకు ఇంకెప్పుడు నీరు ఇస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమిరలలో నిర్మించిన గ్రామ సచివాలయం నూతన భవనం ప్రారంభోత్సవానికి కరణం ధర్మశ్రీ శుక్రవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, యువకులు ఆయనను చుట్టి ముట్టి సమస్యలపై నీలదీశారు. గత సాధారణ ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో ప్రచారం కోసం వచ్చి, ఎమ్మెల్యేగా గెలిపిస్తే నెల రోజుల్లో కేఎం ఛానెల్‌కు సాగునీరు అందించి తీరుతానని హామీ ఇచ్చారని, ఇది జరిగి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. అలాగే ఉర్లలోవ కొండలో సాగుదారులకు డి.పట్టాలు ఇచ్చి వెబ్‌ల్యాండ్‌లో ఆన్‌లైన్ చేయించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా రెవెన్యూ అధికారులతో చేయించలేదని ఆరోపించారు. ఇలా పలు సమస్యలను మీ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ధర్మశ్రీ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసే క్రమంలో ఆయన వెంట వున్న కొంతమంది వైసీపీ నాయకులు కలుగ జేసుకుని.. సచివాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేని నిలదీయడం ఏమిటంటూ ఎదురు దాడికి దిగారు. దీంతో ఇరు వర్గాలు అరుపులు, కేకలు వేసుకుంటూ తోపులాటకు దిగారు. పోలీసులు వచ్చి ఎమ్మెల్యేకు రక్షణ వలంగా ఏర్పడి, ఆయనను బయటకు తీసుకుపోయారు.



గ్రామ సచివాలయంలో రైతులతో గొడవకు దిగిన వైసీపీ నేతలు, వారిస్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

పాడేరురూరల్, ఫిబ్రవరి 2: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు వుండేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహసీల్దారులు, బూత్ స్థాయి అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని ఎన్నికల అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం తప్పనిసరిగా వుండేలా చూడాలన్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.2.5 లక్షలు విడుదల చేస్తున్నామని, ఈ నెల 10వ తేదీనాటికి ర్యాంప్‌ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలను ... మిగతా 8వ పేజీలో

ఐక్య ఉద్యమాలతోనే ఓపీఎస్ సాధన

- ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ

చింతపల్లి, ఫిబ్రవరి 2: ప్రతిపక్ష నేతగా వున్నప్పుడు సీపీఎస్ రద్దుపై ఇచ్చిన హామీని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లు అవుతున్నా నెరవేర్చలేదని ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 4న విశాఖలో నిర్వహించే 'సాగర సంగ్రామ దీక్ష' పోస్టర్లను శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తానని గత ఎన్నికల ప్రచారంలో అప్పటి ప్రతిపక్ష నేతగా వున్న జగన్మోహన్‌రెడ్డి పలుమార్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో వైసీపీ అధికారంలోకి వస్తే తమకు మేలు జరుగుతుందని ఉద్యోగులు ఆశపడ్డారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి, జగన్మోహన్‌రెడ్డి సీఎం అయి 56 నెలలు దాటినా సీపీఎస్‌ను రద్దు చేయలేదని, పైగా జీపీఎస్‌ను తెరపైకి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉద్యోగులకు ఎక్కువ అన్యాయం జరుగుతుందని, పదవీ విరమణ తరువాత వచ్చే ప్రయోజనాలను పూర్తిగా కోల్పోయే ప్రమాదం వుందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు ఐక్యతగా ఓపీఎస్‌ను సాధించుకునేందుకు ఆందోళనలను ఉధృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు గెమ్మెలి మోహన్‌రావు, బౌడు గంగరాజు, సాగిన వెంకటరావు, శెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



'సాగర సంగ్రామ దీక్ష' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు

క్రైం... crime news

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

» మహిళ మృతి » మరొకరికి తీవ్ర గాయాలు


దేముడమ్మ (ఫైల్)

దేవరాపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని రైవాడ శివారు శ్రీరాంపురం మలుపులో లారీ, ద్విచక్ర వాహనం శుక్రవారం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఇదే మండలం పాతవాలాబుకు చెందిన దిప్పల దేముడమ్మ (38) దేవరాపల్లిలోని ఆస్పత్రికి తన మరిది దిప్ప దేముడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, లారీ ఢీకొంది. దీంతో వీరిరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో కె.కోటపాడు ఆస్పత్రికి తరలిస్తుండగా, దేముడమ్మ మృతి చెందింది. దేముడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేముడమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త ఎరుకునాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

నేల బావిలో మహిళ మృతదేహం


అచ్చియ్యమ్మ (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని ఓ గ్రామంలో గల నేలబావిలో మహిళ మృతదేహం కలకలం రేపింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. పెద్దిపాలేనికి చెందిన ఓ మహిళా రైతు శుక్రవారం తన పొలానికి వెళ్లి కూరగాయాల పంటలకు నీటిని అందించేందుకు మోటారు వేసింది. అనంతరం నేల బావి దగ్గరకు వెళ్లిచూడగా దుర్వాసన రావడంతో చుట్ట పక్కల ఉన్న రైతులకు తెలిపింది. వారంతా వచ్చి చూడగా, నీటిపై మహిళ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రామకృష్ణారావు అక్కడి చేరుకుని మృతదేహన్ని బయటకు తీయించారు. విచారణ జరపగా, తూటిపాల గ్రామానికి చెందిన గవిరెడ్డి అచ్చియ్యమ్మ(60) అనే మహిళ నాలుగు రోజుల కిందట తూటిపాల నుంచి పండగ నిమిత్తం లచ్చన్నపాలెం గ్రామం వెళ్లిందని, తిరిగి అదే పొలాల్లో నుంచి వెళుతుండగా నేల బావిలో పడిపోయిందని ఎస్ఐ వివరించారు. ఈమెకు మానసిక స్థితి కూడా సరిగా ఉండడం లేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

లారీని ఢీకొన్న ఆటో

» పది మందికి తీవ్ర గాయాలు » ఒకరి పరిస్థితి విషమం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 2: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న సంఘటనలో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. వివరాల్లోకి వెళితే.. పూడిమడక శివారు జాలారిపాలెంలో ఒక మహిళ చనిపోయింది. విషయం తెలుసుకున్న మృతురాలి మనుమరాలితోపాటు బంధువులు పదిమంది ఆటోపై పూడిమడక వస్తుండగా.. పూడి వద్ద ఆగివున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న పది మంది చెల్లా చెదురుగా రోడ్డుపై పడిపోయారు. క్షతగాత్రులను స్థానికులు వివిధ వాహనాలపై అచ్యుతాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి పంపారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. ఆటో డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఎదురుగా ఆగిఉన్న లారీని గుర్తించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 2: కంపెనీకి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకుండా సొంతానికి వినియోగించుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. స్థానిక నుంకరమెట్ట జంక్షన్‌లోని గోపాల్ ఆటోమేటివ్ ప్రైవేటు లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా కర్రి లీలాసింహభరత్ పనిచేస్తున్నాడు. నలుగురు కస్టమర్ల దగ్గర నుంచి కంపెనీకి రావాల్సిన రూ. 57వేలు వసూలు చేసి కంపెనీకి చెల్లించకుండా తన సొంతానికి వాడుకున్నారని కంపెనీ మేనేజర్ ఎం. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఏటీఎంలో మోసంపై కేసు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో సెప్టెంబరులో ఆగంతుకులు చేసిన మోసంపై గురువారం రాత్రి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన కాండ్రేగుల దొరప్పనాయుడు సెప్టెంబరు నెలలో ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చి నగదు విత్ డ్రా చేసేందుకు ప్రయత్నించగా నగదు రాలేదు. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తాము ట్రై చేస్తామని దొరప్పనాయుడు వద్ద ఏటీఎం కార్డును తీసుకుని వారి వద్ద ఉన్న వేరే కార్డు ద్వారా ప్రయత్నించినట్టు నమ్మించి వేరే ఏటీఎం కార్డును ఇచ్చేశారన్నారు. అసలు కార్డు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.45 వేలు విత్ డ్రా చేసినట్టు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రెండు కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2: ఏజెన్సీ నుంచి గూడూరుకు గంజాయి తరలిస్తున్న యువకుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గూడూరుకు చెందిన చమ్మర్తి వెంకటేష్ కారులో పాడేరు నుంచి గూడూరు వెళుతూ అనకాపల్లికి ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌లోని అండర్‌బ్రిడ్జి కింద కారు ఆపాడన్నారు. అతనితో పాటు మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి బైక్, కారును పక్కన పెట్టి ఎక్కడకో వెళ్లారన్నారు. అండర్‌బ్రిడ్జి కింద ఉన్న కారును సోదా చేయగా.. రెండు కిలోల గంజాయి లభ్యమైందన్నారు. దీంతో గంజాయి, కారును, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని వెంకటేష్‌ను అరెస్టు చేశామన్నారు. బైక్‌కు సంబంధించిన వ్యక్తులపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లంకెలపాలెం, ఫిబ్రవరి 2: లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు ప్రయాణిస్తున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకొంది. అనకాపల్లి ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ తన భార్యతో కలిసి కారులో గాజువాక వైపు వస్తున్నాడు. కారు సరిగ్గా లంకెలపాలెం కూడలి వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేకులు వేశాడు. దీంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి బలంగా ఢీకొంది. ఈ క్రమంలో కారు రహదారిపై బోల్తా పడింది. కారు డ్రైవింగ్ చేస్తున్న భర్త లక్ష్మీనారాయణతో పాటు భార్య తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురి చికిత్స నిమిత్తం విశాఖ నగరంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సురేశ్ ప్రమాదస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ సంబరం


బౌలింగ్ చేస్తున్న జో రూట్


గ్యాలరీల్లో అభిమానుల కోలాహలం


డిఫెన్స్ ఆడుతున్న రజిత్ పటిదార్

భారత్- ఇంగ్లాండ్ క్రికెట్ జట్ల మధ్య రెండో టెస్ట్‌మ్యాచ్ వీసీఏ-ఏడీసీఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయింది. ఊహించని ప్రేక్షకాదరణతో స్టేడియం కొత్త కళ సంతరించుకుంది. తొలిరోజు భారత్ బ్యాటింగ్ కావడంతో అభిమానులు సందడి చేశారు. యశస్వి జైస్వాల్ భారీ శతకంతో టీమిండియాను ఆదుకోగా, ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో స్టేడియంను హోరెత్తించారు. కాగా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఇంగ్లాండ్ జట్టు అభిమానులు కూడా భారీగానే తరలివచ్చారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



క్రీజు నుంచి వెనుదిరుగుతున్న రోహిత్‌శర్మ... గిల్ బ్యాటింగ్


వికెట్ తీసిన స్పిన్నర్ బషీర్‌ను అభినందిస్తున్న ఇంగ్లాండ్ జట్టు క్రీడాకారులు


మ్యాచ్ చూసేందుకు గ్రౌండ్ లోపలకు వెళ్లడానికి ఉత్సాహంగా క్యూల్లో బారులు తీరిన క్రీడాభిమానులు



వికెట్ కోసం అప్పీల్ చేస్తున్న ఇంగ్లండ్ క్రీడాకారులు.. జాతీయ జెండాలతో భారత క్రీడాభిమానుల సందడి

రా.. కదలిరా సభను విజయవంతం చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 4: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 5వ తేదీన గొండుపాలెంలో నిర్వహించతలపెట్టిన రా..కదలి రా బహిరంగ సభను టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ టీడీపీ, జనసేన నేతలు, పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరావు, పప్పల చలపతిరావు మాట్లాడుతూ చంద్రబాబు సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయాలన్నారు. అనంతరం పరిశీలకులు రాజబాబు, దువ్వారపు రామారావు, జనసేన పార్టీ నేతలు రామదాసు, బొద్దపు శ్రీనులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దూలి రంగనాయకులు, కాండ్రకోట చిరంజీవి, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, రాజాన సూర్యనాగేశ్వరరావు, రాజాన నారాయణమ్మ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కొఠారు సాంబ, రాజాన వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

మార్టూరు సచివాలయంలో సర్పంచ్ జన్మదిన వేడుకలు

» సిబ్బంది విధులకు ఆటంకం

» పనులపై వచ్చిన లబ్ధిదారులు తిరుగుముఖం


సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్‌కు కేకు తినిపిస్తున్న కార్యదర్శి

తుమ్మపాల, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు అధికార పార్టీ నాయకుల ఆడంబరాలకు అడ్డాగా మారుతున్నాయి. అనధికార కార్యక్రమాలకు వేదికలవుతున్నాయి. నిలువరించాల్సిన అధికారుల సైతం అధికార పార్టీ నాయకులకు వంత పాడుతున్నారు. కళ్ల ముందు జరుగుతున్న తంతును చూస్తున్న ప్రజలు అధికార పార్టీ నాయకులు, అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు.

అనకాపల్లి మండలం మార్టూరులో శుక్రవారం అధికార పార్టీ సర్పంచ్ జన్మదిన వేడుకలు సచివాలయ ప్రాంగణంలో జరిగాయి. ప్రాంగణంలోనే టెంట్‌లు వేసి, కేకు కటింగ్, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు కార్యక్రమాలు జరగ్గా.. అనంతరం సచివాలయ భవనంలో విందు భోజనాలు సాగాయి. దీంతో సచివాలయంలో విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి తీవ్ర ఆటంకం ఏర్పడడంతోపాటు అధికార పార్టీ సర్పంచ్‌కు భజన చేయాల్సిన దుస్థితి దాపురించింది. మార్టూరు, మాకవరం గ్రామాల నుంచి వివిధ పనులపై సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు సర్పంచ్ జన్మదిన వేడుకల్లో అధికారులంతా బిజీగా ఉండడంతో వచ్చిన వారంతా తమ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. సచివాలయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని విమర్శలు గుప్పించారు. జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మార్టూరు సచివాలయంలో ఇటువంటి అనధికార కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకున్న మార్టూరు పంచాయతీ కార్యదర్శి కూడా అధికార పార్టీ నాయకులకు వంత పాడుతూ సచివాలయ ప్రాంగణంలో జన్మదిన వేడుకలను ప్రోత్సహించడాన్ని పలువురు మండిపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు సచివాలయాల ప్రాంగణాల్లో జరగకుండా ఉన్నతాధికారులు నిలువరించాలని కోరుతున్నారు.

దువ్వాడ మీదుగా టాటా-ఎర్నాకులం మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా టాటా, ఎర్నాకులం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08189 నంబరు గల రైలు ఈనెల 5, 12 తేదీల్లో (ప్రతి సోమవారం) ఉదయం 5.15 గంటలకు టాటాలో బయలుదేరి రాత్రి 8.43 గంటలకు దువ్వాడ, మూడో రోజు ఉదయం 1.55 గంటలకు ఎర్నాకులం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08190 నంబరు గల రైలు ఈనెల 8, 15న (ప్రతి గురువారం) ఉదయం 7.15 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ, మూడో రోజు తెల్లవారుజాము 4.35 గంటలకు టాటా చేరుతుంది.

అనకాపల్లి, విశాఖల్లో ఎక్కడైనా పోటీకి ఓకే

» ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారమే నా అజెండా

» జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏ బాధ్యతలు అప్పగించినా చేపట్టడానికి సిద్ధంగా ఉన్నానని, ఎటువంటి షరతులు లేకుండానే పార్టీలో చేరానని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ వెల్లడించారు. ఆయన దసపల్లా హోటల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పోలవరం నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్రాకు మేలు జరుగుతుందన్నారు. దీనికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఉపయోగపడుతుందన్నారు. స్టీల్‌ప్లాంటుని ఆంధ్రులు పోరాడి సాధించుకున్నా, ఇప్పుడు భారత దేశ సంపద అని ప్రజా ఉద్యమం ద్వారానే దానిని కాపాడుకోగలుగుతామన్నారు. అన్ని పార్టీలను ఒక తాటిపైకి తీసుకువచ్చి కేంద్రంతో పోరాడి సాధించుకోవలసి ఉందన్నారు. రైల్వే జోన్ ప్రకటించినా పనులు ప్రారంభించకపోవడం, ప్రత్యేక హోదా అమలు చేయకపోవడం వంటివి అధికార పార్టీ వైసీపీ వైఫల్యంగా అభిప్రాయపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు డీపీఆర్‌ను కూడా కేంద్రానికి సమర్పించలేకపోయారని కొణతాల అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్రాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రైల్వే జోన్, స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చేయాలనే లక్ష్యాల కోసం పనిచేస్తానని చెప్పగా పవన్ కల్యాణ్ పార్టీ తరఫున పోరాడదామని భరోసా ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయరా?...అని పలువురు ప్రశ్నించగా, పార్టీ అధినేత ఆదేశిస్తే చేస్తానన్నారు. ఎక్కడి నుంచి బరిలో దిగుతారు? ఎంపీగా చేస్తారా? ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? అని ప్రశ్నిస్తే... విశాఖపట్నం, అనకాపల్లిల్లో ఎక్కడి నుంచైనా తనకు అభ్యంతరం లేదన్నారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన తనకు విశాఖపట్నం సొంతూరు అని చెప్పుకోవలసిరావడం బాధగా ఉందన్నారు.

రైల్వే జోన్‌పై అనకాపల్లి ఎంపీ ఇప్పుడు ఏమంటారో..?

» మొదటి వారంలో శంకుస్థాపన

» చేయనున్నట్టు గత నెల 22న ప్రకటన

» అసలు భూమే అప్పగించలేదన్న రైల్వే మంత్రి

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 'వచ్చే నెల మొదటి వారంలో విశాఖపట్నం రైల్వే జోన్‌కు శంకుస్థాపన' అంటూ అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి గత నెల 22న ప్రకటించారు. అంతకు ముందురోజు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనకాపల్లిలో సమావేశం ఏర్పాటు చేసి పోలవరం పూర్తిచేయలేదు...రైల్వే జోన్ ఏమైందో తెలియదు?...అంటూ వైసీపీ పాలనను విమర్శించారు. దానికి కౌంటర్ ఇవ్వాలని తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందడంతో అనకాపల్లి ఎంపీ ఆ మరుసటిరోజే రైల్వే జోన్‌పై ప్రకటన చేశారు. అంటే ఇది ఈ వారంలోనే జరగాలి. కానీ గురువారం ఢిల్లీలో స్వయంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే జోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇవ్వడం లేదని ప్రకటించారు. జోన్‌పై ఏమైనా అడగాలంటే...ఏపీ రాష్ట్ర ప్రభుత్వాన్నే అడగాలని సూచించారు. అంటే ఇప్పటివరకూ భూముల అప్పగింత కార్యక్రమమే కొలిక్కిరాలేదని అర్థమవుతోంది. మరి అనకాపల్లి ఎంపీ ఈ వారంలో జోన్‌కు ఎవరితో, ఎక్కడ శంకుస్థాపన చేయిస్తారో చెప్పాల్సి ఉంది.

వలంటీర్ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

» మాజీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని విచారిస్తున్న పోలీసులు

» మరికొందరి కోసం గాలింపు

» వివాహేతర సంబంధాలే కారణమన్న చర్చతో ఆ దిశగా ఆరా..!


హరినాథ్ (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీర్ హత్య ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. గురువారం వలంటీర్ హరినాథ్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీంతో నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు, నాతవరం ఎస్ఐ రామారావులు విచారణ చేపడుతున్నారు. మృతదేహం వద్ద సెల్‌ఫోన్, నిరోధ్, గాజులు, చెప్పులతో పాటు మరికొన్ని వస్తువులు లభ్యమయ్యాయి. సదరు వ్యక్తికి కొందరు మహిళలతో వివాహేతర సంబంధాలు ఉన్నట్టు పోలీసు అధికారులు గుర్తించారు. ఇదిలావుంటే, బుధవారం రాత్రి తమ ఇంటికి ఓ వ్యక్తి వచ్చి హరినాథ్‌ను తీసుకు వెళ్లాడని మృతుని తల్లి ఈశ్వరమ్మ పోలీసులకు తెలిపింది. ఆ వ్యక్తి కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. అలాగే ఫోన్ కాల్ డేటా ఆధారంగా లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ (వైసీపీ), పంచాయతీ మహిళా కార్యదర్శితో పాటు మృతదేహం పడి ఉన్న పొలానికి చెందిన మరో వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు. వీరితో పాటు అదే గ్రామానికి చెందిన మరికొంత మందిని కూడా విచారిస్తున్నారు. అదేవిధంగా మృతుడు వలంటీర్‌తో స్నేహం చేసిన కొంత మంది ఫోన్‌లు స్విచ్ ఆఫ్‌చేసి ఉండడంతో వారి ఆచూకీ కోసం పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. ఇదిలావుంటే, వివాహేతర సంబంధమే వలంటీర్ ప్రాణాలు తీసిందని గ్రామంలో చర్చ సాగుతోంది. రెండు రోజుల్లో కేసును ఛేదిస్తామని పోలీసులు చెపుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 2: జిల్లాలో స్వయం ఉపాధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద లబ్ధిదారునికి కావాల్సిన అధునాతన పరికరాల కొనుగోలుకు, వర్కుషెడ్‌కు అయ్యే వ్యయంలో 10 శాతం లబ్ధిదారుడు పెట్టుబడి పెట్టాలన్నారు. మిగతా 90 శాతం బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తుందని, అందులో 35 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు జిల్లా హార్టికల్చర్ కార్యాలయంలో ఆధార్, పాన్, కరెంటుబిల్, బ్యాంకు పాస్‌బుక్ తీసుకుని సంప్రదించాలని లేదా 9603222037 కు వాట్సాప్ చేయాలన్నారు.

పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 2: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ కేవీ మురళీకృష్ణ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి వినతులను స్వీకరించారు. సుమారు ఎనిమిది మంది పోలీస్ సిబ్బంది తమ ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్పీకి వివరించారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై వారు విన్నవించుకున్నారు. తన పరిధిలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేస్తానని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు.

జైస్వాల్ వీరవిహారం

... 5వ పేజీ తరువాయి

రెహన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా మరో బౌండరీ, బ్యాక్ కవర్ మీదుగా సిక్సర్ బాదడంతో గ్యాలరీలు హోరెత్తాయి. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. వ్యక్తిగత స్కోరు 17 పరుగుల వద్ద బషీర్ బౌలింగ్‌లో రెహన్ క్యాచ్ పట్టడంతో ఆరో వికెట్‌గా వెనుతిరిగాడు. తొలి రోజు ఆటకు ఊహించిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. టీ20, వన్డే మ్యాచ్‌లకు మాదిరిగా గ్యాలరీలన్నీ పూర్తిగా నిండకపోయినా, ఇతర నగరాల్లో జరిగిన మ్యాచ్‌లకు హాజరైన ప్రేక్షకులతో పోల్చితే ఇక్కడ ఆదరణ ఎక్కువగా లభించిందని చెప్పవచ్చు. రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడం, ఏసీఏ పరిధిలోని క్లబ్ క్రికెటర్లకు ఉచిత పాస్‌లు జారీ చేయడంతో కొన్ని గ్యాలరీలలో ప్రేక్షకుల హడావుడి కనిపించింది. అలాగే దక్షిణ వైపు గల ఎం, ఎం-1 స్టాండ్స్ దాదాపు నిండిపోయాయి. జైస్వాల్ సెంచరీ పూర్తయ్యాక కొందరు ఇంటిముఖం పట్టారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అన్ని వర్గాల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

» పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి చెప్పారు. మండలంలోని శింగవరం గ్రామంలో జయహో బీసీ మహాసభను పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణరావు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు గొలుసింగి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వర్గంతో పాటు అన్ని వెనుకబడిన వర్గాల సంక్షేమమే పార్టీ అధినేత ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. ముఖ్యంగా మన్యంలో ఉన్న బీసీ తెగను అన్ని విధాలా ఆదుకునేలా ఎన్నికల మేనిఫెస్టో రూపొందించి, వారి సంక్షేమానికి కృషి చేయటం జరుగుతున్నదని చెప్పారు. బీసీలకు వచ్చే ప్రతీ సంక్షేమ పథకాలపై తనవంతు కృషి చేస్తానన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నా మన్యంలో ఏ వర్గానికి న్యాయం జరిగిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన విశ్వేశ్వరరాజు ఎస్టీ కమిషన్ సభ్యునిగా అధికారంలో ఉండి ఎంతమంది గిరిజనులను అభివృద్ధి బాటలో నడిపించారని ఆమె ప్రశ్నించారు. అనంతరం గోవింద్ మాస్టారు మాట్లాడుతూ మద్యపాన నిషేధం చేసి ఓటు అడుగుతానన్న జగన్మోహనరెడ్డి, నిషేధానికి నీళ్లొదిలారన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. అనంతరం ఈశ్వరి ఆధ్వర్యంలో బీసీ తెగకు చెందిన పద్మశాలి సంఘ అధ్యక్షుడు ఎక్కల దేవి నాగేశ్వరావు ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాలు వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణరావు, నాయకులు కిల్లో పూర్ణ చంద్రరావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, నేతలు దొరబాబు, భూషణ్, నక్కా ఆనంద బాబు, గంగరాజు, ఆనంద్, కేశవ, లక్ష్మణ్, బుచ్చిబాబు, సత్య, రాజేశ్వరి, వరలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.




జయహో బీసీ సభలో ప్రసంగిస్తున్న పార్టీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి... కార్యక్రమానికి సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు ప్రసాద్, నాగరాజు తదితరులు

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేయండి

» జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు టీడీపీ నాయకుల వినతిపత్రం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 2: జిల్లాలో ఉన్నత విద్యనభ్యసించిన గిరిజన నిరుద్యోగ యువతకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని టీడీపీ కోరారు. ఈ మేరకు సుమారు వంద మంది శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు స్పెషల్ డీఎస్సీతో పాటు గిరిజన రైతులు పండించే వాణిజ్య పంటలు పసుపు, మిరియాలు, కాఫీ, జీడిమామిడి పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయ రాణి, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి.చిట్టిబాబు, గాడి శ్రీరామూర్తి, లోతా భీమరాజు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, లక్ష్మయ్య, చందరరావు, రాజు,చిన్న, గోవింద్, వెంకటలక్ష్మి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పదవి ముగుస్తున్నా సీపీఎస్ రద్దు చేయని సీఎం

» పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి



సాగర సంగ్రామం దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూవీ గిరి, ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 2: పదవీ కాలం ముగుస్తున్నప్పటికీ సీపీఎస్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రద్దు చేయలేదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. రింతాడ గిరిజన సంక్షేమ శాఖ బాలిక ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 4వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే సాగర సంగ్రామం దీక్ష పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో సీపీఎస్‌ను వారం రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి, నేటి వరకు రద్దు చేయకపోవడం దారుణమని వాపోయారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం, ఉద్యోగులకు తీరని అన్యాయం చేస్తూ జీపీఎస్‌ను తెరపైకి తీసుకొచ్చిందన్నారు. జీపీఎస్ వల్ల ఉద్యోగులకు పదవీ విరమణ తరువాత వచ్చే రాయితీలు అందవన్నారు. దీంతో సీపీఎస్ ఉద్యోగులు భారీగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓపీఎస్‌ను సాధించుకునేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు, ఉద్యోగులు ఐక్యతగా పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించేందుకు ఏర్పాటు చేసిన సంగ్రామం దీక్షకు అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసీలు గంజాయికి దూరంగా ఉండాలి

» మెగా వైద్య శిబిరంలో 380 మందికి వైద్య పరీక్షలు: అదనపు ఎస్పీ



వాలీబాల్ టోర్నీ విజేతలకు నగదు చెక్‌ను అందిస్తున్న అదనపు ఎస్పీ శివకిశోర్

సీలేరు, ఫిబ్రవరి 2: ఆదివాసీలు గంజాయికి దూరంగా ఉండాలని అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ సూచించారు. గాలికొండ పంచాయతీ పరిధిలోని సీపీఐ మావోయిస్టు పార్టీకి కంచుకోటగా పేరొందిన పాతునిగుంట గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా 'యువహో', 'సంజీవని' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలు జిల్లా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యువహో పేరిట వాలీబాల్ టోర్నమెంట్లు ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. సంజీవని పేరిట గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా, పాతునిగుంటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 380 మందికి సేవలు అందించారు. అలాగే వాలీబాల్ టోర్నీ విజేత గాలికొండ జట్టు క్రీడాకారులకు ట్రోపీ అందజేశారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు అప్పలసూరి, రామకృష్ణ, లోకేశ్‌కుమార్, వైద్యులు డీకే హిమబిందు, కృష్ణారావు, సర్వేశ్, రవికిరణ్, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, ఎంపీటీసీ ఎ.బుజ్జిబాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేయాలని, ఈ విషయమై ఏఎస్పీలతో చర్చించాలని స్పష్టం చేశారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు కచ్చితంగా అమలు

ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధి నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని స్పష్టం చేశారు. బదిలీల అనంతరం కొత్తగా విధుల్లో చేరిన తహసీల్దార్‌లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. తుది ఓటరు జాబితాల్లో పేర్లను తొలగించాల్సి వస్తే విధిగా ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేసీ భావన వశిష్ఠ, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, డీఆర్వో వి.రమణ, ఎస్‌డీసీలు వీవీఎస్.శర్మ, అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు ఎందుకు ఆపడం లేదు?

» రెవెన్యూ అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు

» వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ముంచంగిపుట్టు, జనవరి 2: ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను ఎందుకు ఆపడం లేదని అధికారులను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. పలు సమస్యలపై పలు శాఖల అధికారులను సభ్యులు నిలదీశారు. ప్రధానంగా ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సంరక్షించాలని, ప్రభుత్వ భూముల్లో ఆక్రమ కట్టడాలు జరుగుతున్నా, వాటిపైన ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడంలేదని తహసిల్దార్ నర్సమ్మను ఎంపీపీ సీతమ్మతో పాటు వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సభ్యులు నిలదీశారు. ప్రభుత్వ భూములకు కనీస రక్షణ లేకుండా పోయిందని, ఎక్కడపడితే అక్కడ ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఎంపీపీ సీతమ్మ ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న ఆక్రమణ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గుర్తించి ఆపాలని, లేకుంటే తామే స్వయంగా ఆపాల్సి ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. ఆక్రమ నిర్మాణాలను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని సభ్యులు ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ పథకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రనిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై సభ్యులు పలు శాఖల అధికారులపై ధ్వజమెత్తారు. వైద్య ఆరోగ్య శాఖ, జీసీసీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఆర్, ఐసీడీఎస్, ఆర్‌యండ్‌బీ, నాడు నేడు పనులకు సంబంధించి ఆయా శాఖల అధికాలతో సభలో వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ఎ.సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు విధిగా తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని, వచ్చే సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని, సకాలంలో అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఏవో శ్రీనివాస్ బాబు, జీసీసీ మేనేజర్ మోహన్, పీఆర్ ఏఈఈ గోపాలకృష్ణ, ఎస్ఐ రవీంద్ర, పాటు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్ నర్సమ్మను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

నిరుద్యోగ యువతకు టాటాప్లాంట్‌లో ఉద్యోగాలు

6న చింతపల్లి వైటీసీలో ఇంటర్వ్యూలు: అదనపు ఎస్పీ శివకిశోర్

చింతపల్లి, ఫిబ్రవరి 2: గిరిజన ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించనున్నట్టు అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. ఈ మేరకు స్థానిక యువజన శిక్షణ కేంద్రంలో ఈ నెల 6న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది గిరిజన ప్రాంతం నుంచి 70 మంది యువతులు టాటా ప్లాంట్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రస్తుతం 70 మంది ఐఫోన్‌ల తయారీలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కంపెనీ ఉద్యోగులకు మంచి వేతనంతో పాటు పీఎఫ్, హెల్త్ ఇన్సురెన్స్, వసతి ఉంటాయన్నారు. ఈ ఏడాది మరో 70 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు టాటా కంపెనీ ముందుకొచ్చిందన్నారు. ఇంటర్వ్యూలకు నేరుగా హాజరయ్యే యువతులు విద్యార్హత, ఆధార్ కార్డుతో రావాలన్నారు. అలాగే గిరిజన ప్రాంత యువతులకు పోలీసు శాఖ కల్పిస్తున్న మంచి అవకాశమన్నారు. మైదాన ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాలని ఆశించిన ప్రతీ యువతి ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతులకు పోలీసు శాఖ పూర్తి భద్రత కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ కె.రమేశ్, ఎస్ఐ అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పక్కన సీఐ, ఎస్ఐ

కొనసాగుతున్న ఉపాధ్యాయుల నిరాహార దీక్షలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 2: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాటికి ఈ దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు మాట్లాడుతూ హామీలు ఇచ్చిన పాలకులు, వాటిని అమలు చేయకుండా మరిచిపోవడం విచారకమని వాపోయారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా నాడు పాదయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు దీక్షలు చేపడుతుంటే స్పందించక పోవడం, తేలు మందం వైఖరిని ప్రదర్శించడం ప్రభుత్వానికి తగదన్నారు. సంపాదిత సెలవులు సరెండర్ చేసి రెండేళ్ల గడిని జమచేయకపోవడం అన్యాయమని వాపోయారు. తాము పొదుపు చేసుకున్న సొమ్ము నుంచి రుణాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, జి.మాడుగుల మండలాధ్యక్షుడు ఎస్.గంగాధర్, ముంచంగిపుట్టు మండల కార్యదర్శి సీసా గోపి, జిల్లా కార్యవర్గ సభ్యులు గల్లెల సతీష్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం.శ్రీను, ఈశ్వరరావు నాయుడు, సింహాచలం, ధనుపతి, ఆనంద్, చిన్నయ్య, గోవింద్, జయకృష్ణ, అవినాష్, గణేష్, చిరంజీవి పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న యూటీఎఫ్ నాయకుల

లక్ష్మీదేవిపేటలో గుడిసెల కూల్చివేత

» రెండేళ్ల క్రితం రెండుచోట్ల 70 ఎకరాల్లో గుడిసెల ఏర్పాటు

» సుమారు 600 గడిసెలు, రేకుల షెడ్లు నేలమట్టం

» హైకోర్టు ఉత్తర్వులతో తొలగించిన రెవెన్యూ, పోలీసులు

» భారీగా మోహరించిన పోలీసు బలగాలు

ఎటపాక, ఫిబ్రవరి 2: మండల కేంద్రమైన ఎటపాకలోని లక్ష్మీదేవిపేట రెవెన్యూ విలేజ్ పరిధిలో రెండుచోట్ల గత రెండేళ్ల కిందట ఆదివాసీలు నివాసం ఏర్పరుచుకున్న గడిసెలు, రేకుల షెడ్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసు, రెవెన్యూ సంయుక్త ఆధ్వర్యంలో గుడిసెల తొలగింపు ఆపరేషన్‌ను నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వులు, అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో బుల్డోజర్లతో పోలీసు బలగాలు అక్కడ చేరుకున్నాయి. గుడిసెల్లో ఆదివాసీలు నిద్రిస్తున్న సమయంలో, ఇంట్లోని సామగ్రిని ఖాళీ చేయించి, అనంతరం బుల్డోజర్లతో గుడిసెలు, రేకులషెడ్లను నేలమట్టం చేశారు. రెండేళ్ల కిందట విలీన మండలాలకు చెందిన ఆదివాసీలతోపాటు తెలంగాణలోని భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన ఆదివాసీలు ఇక్కడ భూమిని ఆక్రమించి గుడిసెలను ఏర్పాటుచేసుకున్నారు. గత రెండేళ్ల నుంచి ఈ గుడిసెల్లోనే నివాసముంటున్నారు. అయితే ఈ భూమిపై అన్ని హక్కులు ఉన్నాయంటూ కొందరు కొన్ని నెలల కిందట హక్కు పత్రాలతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో భూమి గల యాజమానులకు అనుకూలంగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయడంతో ఇటీవల రెండుసార్లు రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో గుడిసెలు ఏర్పాటుచేసుకున్న ఆదివాసీలకు నోటీసులు కూడా అంజేశారని, అయినా స్పందించలేదని తహశీల్దార్ పృథ్వీ తెలిపారు. న్యాయస్థానం ఉత్తర్వులతో లక్ష్మీదేవిపేటలోని రెండుచోట్ల 70 ఎకరాల భూమిలోని 600 గుడిసెలు, రేకుల షెడ్లను కూల్చివేశారు. అయితే ఈ రెండుచోట్ల గుడిసెలు వేసిన వారిలో తెలంగాణకు చెందిన ఆదివాసీలు కూడా ఉన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా గుడిసెలు కూల్చారని ఆదివాసీ మహిళలు పేర్కొంటున్నారు. ఈ భూమి తమకే చెందుతుందని, 2 సెంట్ల భూమికి తమ వద్ద నుంచి గిరిజన సంఘాల నాయకులు కొందరు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారని గుడిసెల ఏర్పాటుచేసుకున్న ఆదివాసీ పేర్కొంటున్నారు. గుడిసెలు వేసుకున్నచోట విద్యుత్, రహదారులు, డ్రైనేజీ కూడా నిర్మించి ఇస్తారని చెప్పారని తెలిపారు. అయితే గుడిసెల తొలగింపు సమయంలో ఆ ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. డాక్టర్ పాలరాజ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో లక్ష్మీదేవిపేటలో 100 గుడిసెలు, లక్ష్మీదేవిపేటలో మరో ప్రాంతంలో 500 గుడిసెలను కూల్చివేశారు. గుడిసెల తొలగింపు కార్యక్రమం ముగిశాక చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఆ ప్రాంతంకు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొడవలు, ఆందోళనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



ఎక్స్‌కవేటర్‌తో పాకలను తొలగిస్తున్న దృశ్యం

నిర్వాసితుల గుడిసెల తొలగింపు ఆపండి

పాడేరు రూరల్: జిల్లాలోని ఏటపాక మండలం మామిళ్లగూడెం వద్ద పోలవరం భూ నిర్వాసితులు వేసుకున్న గుడిసెల తొలగింపును ఆపాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. కన్నయ్యగూడెం వద్ద ప్రభుత్వం నిర్మించిన నిర్వాసిత కాలనీ గోదావరి వరదల్లో ముంపునకు గురికాగా, వరద తాకిడికి దూరంగా ఉన్న మామిళ్లగూడెం వద్ద ప్రభుత్వ ఖాళీ భూముల్లో సుమారు 500 మంది ఆదివాసీలు గుడెసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. శుక్రవారం రెవెన్యూ, పోలీసు అధికారులు తొలగింపు ప్రక్రియ చేపట్టడం విచారకరమని వాపోయారు. ఈ ప్రక్రియను అధికారులు ఆపాలని కోరారు.

☛ సంక్షిప్తంగా..

మిరియాలకు గిట్టుబాటు ధర

» జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



పాడేరు రూరల్, ఫిబ్రవరి 2: జిల్లాలో పండించే మిరియాలకు మార్కెట్‌లో అత్యధిక డిమాండ్‌తో పాటు గిట్టుబాటు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. పాడేరు మిరియాలకు జాతీయంగా గుర్తింపు ఉన్నందున రైతులు మంచి ధరకు అమ్మకాలు చేయాలని సూచించారు. చిక్మగలూరు, మడిగిరి, ఇడుక్కి, మంగుళూరు, పుత్తూరు, గోవా, కొచ్చిన్ తదితర ప్రాంతాల్లో కిలో మిరియాలు రూ.560 నుంచి రూ.600 వరకు ధర పలుకుతుందన్నారు. అదే విధంగా తెల్ల మిరియాలకు మరింత గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ప్రస్తుతం కిలో రూ.685 ఉందన్నారు. జిల్లాలో మిరియాల రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. మిరియాల శుద్ధి యంత్రాలను 75 శాతం రాయితీతో సరఫరా చేసినట్టు ఆయన చెప్పారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలో మూడు రోజులుగా పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం నాలుగు రోడ్ల కూడలితో పాటు జోలాపుట్టు, పెదబయలు, సంగడ, రూడకోట, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన జంక్షన్ల వద్ద సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు బలగాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా కనిపించే వ్యక్తులను ప్రశ్నించి విడిచి పెడుతున్నారు. ఛత్తీస్‌గడ్ ప్రాంతంలో పోలీసులపై మావోయిస్టులు దాడికి దిగడంతో ఆంధ్రా పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా గాలింపులు, వాహన తనిఖీలు, గస్తీలను నిర్వహిస్తున్నారు. అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

గ్రామాల్లో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని మారుమూల ఐనాడ, దేవాపురం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న ఆరు గ్యారంటీలను వివరించారు. అలాగే కుటుంబాలను భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో నమోదు చేయించారు. జగన్ రెడ్డి కుయుక్తులకు మరోసారి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేదని ఈ సందర్భంగా సుబ్బారావు అన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసినా చిత్తు చేసేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగానే ఉన్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు కంకణం కట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.పిన్నయ్యదొర, కె.వీరయ్యదొర, బాలరాజు, పోతురాజు, చిన్నమ్మ, కాంతారావు, వినోద్, శివ, శంకర్, కళ్యాణ్, చిన్నారావు, రమణ, పెద్దదేముడు, నూకాలు పాల్గొన్నారు.

'యువతను వంచించిన ప్రభుత్వం'

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 2: వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు మోసం చేస్తున్నదని టీడీపీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి అన్నారు. శుక్రవారం దారెల పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో 20 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని జగన్ ఇచ్చిన హామీని అమలుచేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసమే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు ప్రకటిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.కిశోర్, రఘునాథ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

చింతపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని బెన్నవరం పంచాయతీ పరిధి రేవళ్లు, గచ్చుపల్లి గ్రామాల్లో ఆదివాసీ మహిళలకు చేయూత వారియర్స్ ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ దూనబోయిన రమణ మాట్లాడుతూ ఆదివాసీలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారియర్స్ ట్రస్టు సభ్యులు కె.బిలాస్కర్, జగన్ పంతులు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ

ముంచంగిపుట్టు, జనవరి 2: మండల కేంద్రంలో ఈ నెల 7 నుంచి ఆదివాసీ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధి బి.బాబూరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత శిక్షణకు సంబంధించి పూర్తి వివరాల కోసం 9014746943 సెల్ నంబరుకు సంప్రదించాలని ఆయన సూచించారు.

సమష్టిగా పనిచేద్దాం: మత్స్యలింగం

అరకులోయ, ఫిబ్రవరి 2: పార్టీ విజయానికి సమష్టిగా పనిచేద్దామని వైసీపీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం కోరారు. స్థానికులకే అవకాశం కల్పించినందున కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారంలోనే సంతృప్తి



తహసీల్దార్ తిరుమలరావును సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యూరు, ఫిబ్రవరి 2: మండలంలో దీర్ఘకాలంగా నెలకొన్న రెవెన్యూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలోనే సంతృపి ఉంటుందని తహసీల్దారు తిరుమలరావు అన్నారు. బదిలీపై విజయనగరం జిల్లాకు వెళ్తున్న అతన్ని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం కార్యాలయ సిబ్బంది, పలు పార్టీ నాయకులు, అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతయ్య, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, జడ్పీటీసీ వారా నూకరాజు, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.